కొట్టకురా.. చెట్టునురా!

చెట్టునురా.. చెలిమినిరా, తరువునురా.. తల్లినిరా, నరికివేయకురా..అమ్మనురా.. అమ్మబోకురా, కొడుకు వురా..కొట్టకురా అంటూ వృక్షాల గురించి నేలమ్మ అనే పుస్తకంలో రాశారోకవి. నీడనిచ్చే వృక్షాలను కనికరం లేకుండా మొదలు వరకు నరుకుతుంటే మానవత్వం ఉన్న హృదయాలు ఇలాగే రగిలిపోతున్నాయి. ప్రాణవాయువుని ఉచితంగా అందించే పచ్చని చెట్లపై కొందరి దాష్టీకం మానవ మనుగడకే ప్రశ్నార్థకంగా మారింది. టేక్మాల్ మండల కేంద్రంతో పాటు బర్దిపూర్, పల్వంచ, కుసంగి, మాల్కాపూర్, దాదాయిపల్లి, అచ్చన్నపల్లి, ఎలకుర్తి తదితర గ్రామాల శివారుల్లో అక్రమార్కులు అడ్డగోలుగా చెట్లను నరికివేస్తున్నారు. హరితహారం పేరుతో మొక్కలు నాటుతుంటే అక్రమార్కుల చేతిలో ఇలా మహా వృక్షాలు నరుకుతున్నారు. అధికారులు సైతం వత్తాసు పలుకుతుండటంతో వారి ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. – టేక్మాల్(మెదక్)


మల్కాపూర్ శివారులో చెట్టును నరికేసిన దృశ్యం


టేక్మాల్ శివారులో దుంగలు


బర్దిపూర్ శివారులో ట్రాక్టర్‌లో నింపుతున్న కట్టెలు

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలపివేస్తామని ఏఈ దుర్గప్రసాద్ తెలిపారు. ట్రాన్స్‌మిషన్ మరమ్మతుల్లో భాగంగా పాంబండ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పాంబండ, ఉసిరికపల్లి, భీమ్లా పంచాయతీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

కొనసాగుతున్న వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు


దొంతి గ్రామ వీధుల్లో స్వామివారికి పల్లకిసేవ చేస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన దొంతి వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి, సమేత వేణుగోపాలస్వామి వామనావతారంలో పల్లకీ సేవ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా నిర్వహించారు. మంగళవారం రామావతారంలో స్వామివారి పల్లకి సేవ నిర్వహిస్తామని ఆలయ అర్చకుడు వేణు గోపాలశర్మ తెలిపారు.

పీర్లతండా దర్గా వద్ద ప్రార్థనలు


పీర్లతండాలో తండావాసులతో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): పీర్లతండాలో దర్గా వద్ద నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పీర్లతండా పంచాయతీ మర్రిచెట్టు కిందగల దర్గవద్ద తండా వాసులు ప్రతి సంవత్సరం సామూహిక ప్రార్థనలు నిర్వహించి ఉత్సవాలు చేస్తారు. అందులో భాగంగా సోమవారం సైతం దర్గా వద్ద గంధం ఊరేగించి ప్రార్ధనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజునాయక్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రామాగౌడ్, నాగ్సాన్‌పల్లి మాజీ సర్పంచ్ ఎల్లం, మనోహర్‌రెడ్డి ఉన్నారు.

ట్రైసైకిల్ అందజేత


దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందిస్తున్న బంజారా దివ్యాంగ ఐక్య సమితి ప్రతినిధులు

నర్సాపూర్: మండలంలోని అద్మాపూర్ బోడ గట్టు తండాకు చెందిన దివ్యాంగుడు దేవిసింగ్‌కు సోమవారం ట్రైసైకిల్ అందజేశారు. బంజారా దివ్యాంగ ఐక్య సమితి జిల్లా శాఖ అధ్యక్షుడు మాలోత్ విఠల్ నాయక్, ఉపాధ్యక్షుడు రాజు కృషి చేసి నర్సాపూర్ సీడీపీఓ హేమభార్గవి సహకారంతో దేవిసింగ్‌కు ట్రైసైకిల్ మంజూరయ్యేలా కృషి చేశారు.

రేపటి నుంచి దుర్గమ్మ జాతర

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని చీలాపల్లిలో దుర్గమ్మ ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 22న అమ్మవారికి బోనాలు, 23న బండ్ల ఊరేగింపు, 24న పాచిబండ్ల ఊరేగింపు, 25న కుస్తీపోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ఎంపీపీ కల్లూరి హరికృష్ణ

శివ్వంపేట(నర్సాపూర్): అకాల వర్షాలకు తడిసిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం కురిసిన వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని సోమవారం పరిశీలించారు. చిన్నగొట్టిముక్ల కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి జిల్లా అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని సకాలంలో తూకం వేసి తరలించకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం గుర్తు చేశారు. శివ్వంపేట, చెన్నాపూర్, చిన్నగొట్టిముక్ల గ్రామాల్లో అధికంగా వర్షం కురిసిందని ఆయా ప్రాంతాల్లో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందజేయాలన్నారు. అనంతరం పలు రైస్‌మిల్స్ వద్ద ధాన్యం లారీల అన్‌లోడింగ్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దశరథ్, బీఆర్‌ఎస్ నాయకులు నారాయణరావు, నరేందర్, పాపయ్యచారి, హర్షనాయక్, తదితరులు ఉన్నారు.


చిన్నగొట్టిముక్లలో రంగు మారిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ హరికృష్ణ

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి

పాపన్నపేట(మెదక్): తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి పోతుందని అన్నారు. అధికారుల ప్రణాళిక లోపంతో ధాన్యం తరలింపులో జాప్యం జరుగుతుందన్నారు. లారీలు సకాలంలో రాక, రైతులు కల్లాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందని చెప్పారు.


వెల్దుర్తి(తూప్రాన్): కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యంతో రైతులు, నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం మాసాయిపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు సందర్శించారు. తడిసిన ధాన్యం రాసుల వద్ద రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించారు. ధాన్యం మొలకెత్తడంతో వాటితో తహసీల్దార్ కార్యాలయ వద్ద నిరసన చేశారు. నత్తనడకన కొనసాగుతున్న కొనుగోలు ప్రక్రియతో కొనుగోలు కేంద్రాల్లో మొలకెత్తిన ధాన్యాన్ని ప్రభుత్వం ఎలాంటి షరతులు విధించకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో మండలాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నాగరాజు, మాజీ వార్డు సభ్యులు పవన్ తదితరులు ఉన్నారు.

ధాన్యం రవాణా చేయట్లేదు


కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం బస్తాలు, కుప్పలు

రైతుల ఆవేదన

నర్సాపూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నింపిన వడ్ల బస్తాలను రైసుమిల్లులకు రవాణా చేయట్లేదు. దీంతో రైతులు అనేక ఇబ్బందుల పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు కొనుగోలు కేంద్రాల్లో వడ్లు సంచుల్లో నింపి కాంటా పెట్టినా.. వాహనాలు లేక వాటిని తరలించనందున వడ్ల బస్తాలు కొనుగోలు కేంద్రాల్లోనే ఉండిపోయాయి. మూడు రోజులుగా అకాల వర్షాలు పడుతున్నందున వడ్ల బస్తాలపై టార్పాలిన్లు కప్పినప్పటికీ చివర ఉన్న బస్తాలు తడిసి వాటిలోని వడ్లు తడిశాయని రైతులు చెప్పారు. చివరి బస్తాలు తడవడంతో అన్ని బస్తాలు మిల్లులకు తరలించమని, తడిసిన బస్తాల్లోని వడ్లను మళ్లీ ఎండపోయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చెప్తున్నారని దీంతో తమకు డబుల్ పనులు అవుతాయని వారు వాపోయారు. వడ్లు బస్తాల్లో నింపినా.. మిల్లులకు తరలించకపోవడం నిర్వాహకుల నిర్లక్ష్యమని, వాహనాలు రాకపోతే తాము ఎందుకు బాధ్యత వహించాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. తడిసిన బస్తాల విషయమై ఐకేపీ ఏపీఎం గౌరీశంకర్‌ను వివరణ కోరగా.. వర్షాలకు తడిసిన బస్తాల్లోని వడ్లను వేరే బస్తాల్లోకి మార్చే పనులు సెంటర్ల ఆధ్వర్యంలో చేపడుతున్నామని ఆయన చెప్పారు. మంతూర్ సెంటర్‌లో బస్తాలు మార్చే పనులు చేపట్టామని, ఇతర సెంటర్లలో మంగళవారం నుంచి చేపడుతామని వివరించారు.

కార్యదర్శులకు మినహాయింపు ఇవ్వాలి


ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

నర్సాపూర్: గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలనలో భాగంగా పంచాయితీ కార్యదర్శులు చేపట్టే పనులకు సొంత డబ్బు ఖర్చు విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలని మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ మధులతను కోరారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు, పలువురు కార్యదర్శులు సోమవారం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రత్యేక అధికారుల పాలన వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో చేపడుతున్న పనులకు ప్రభుత్వం నుంచి నిధులు రానందున తాము తమకు వచ్చే వేతనాల నుంచి ఖర్చు చేయాల్సి వస్తుందని వివరించారు. దీంతో తమ కుటుంబాల పోషణకు అప్పులు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఇప్పటి వరకు వ్యయం చేసిన డబ్బులు ఇప్పించాలని ఎంపీడీఓను కోరారు. కాగా గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పలువురు కార్మికులకు సుమారు ఆరు నెలలుగా జీతాలు రానందున జూన్ ఒకటి నుంచి వారు విధులకు రామని చెప్పారని, వారి జీతాలు వచ్చేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఎంపీడీఓ స్పందిస్తూ సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకుపోతానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు మల్లేశం, తారాసింగ్, లక్ష్మణ్, రవి, లలిత, సంగీత, పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు


ధాన్యాన్ని పరిశీలిస్తున్న నవీన్‌గుప్తా

శివ్వంపేట(నర్సాపూర్): తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళన చెందొద్దని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నవీన్‌గుప్తా అన్నారు. సోమవారం మండలంలోని పలు కొనుగోలు కేంద్రాలను సందర్శించి తడిసిన ధాన్యంతో పాటు రైతులు ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తడిసిన ధాన్యంతో పాటు కేంద్రాల్లో ఉన్న ధాన్యం త్వరగా తరలించేందుకు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, ప్రభులింగంగౌడ్, గణేశ్, అరుణ్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

చిన్నశంకరంపేట(మెదక్): తెలంగాణలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని మాలల హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మైసయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నార్సింగిలో మాట్లాడుతూ.. తాజాగా రామాయంపేట మండలం వెంకటాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారని గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు.

ట్రాక్టర్లపై కేసు నమోదు

నర్సాపూర్: అనుమతులు లేకుండా చెరువు నుంచి మట్టి తరలించిన రెండు ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపారు. మండలంలోని రాంచంద్రాపూర్ చెరువు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి తీసి వాణిజ్య అవసరాలకు తరలించగా మండల ఆర్‌ఐ ఫైజల్ ట్రాక్టర్లు పట్టుకొని తమకు అప్పగించి ఫిర్యాదు ఇచ్చారని ఎస్‌ఐ తెలిపారు. ఆర్‌ఐ ఫిర్యాదుతో ట్రాక్టర్ల యజమానులపై కేసులు నమోదు చేశామని పోలీసులు చెప్పారు.

ఉన్నత చదువులు చదవాలి


ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొని మంచి స్థాయికి ఎదగాలని దొంతి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రవి అన్నారు. సోమవారం పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రొవిజనల్ మార్క్స్ మెమో, టీసీ, బోనఫైడ్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నచ్చిన విద్యా కోర్సులు ఎంచుకుని శ్రద్ధగా చదువుకొని జీవితంగా ఎదగాలన్నారు. 58 మంది విద్యార్థులకు 52 మంది ఉత్తీర్ణత సాధించారని మిగతా వారు కూడా సప్లమెంటరీ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, గౌరీశంకర్, మల్లేశ్, హీరాసింగ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

తొలగిపోయిన పౌల్ట్రీ ఫామ్ రేకులు

శివ్వంపేట(నర్సాపూర్): ఈదురు గాలులతో నిర్మాణం పూర్తయిన పౌల్ట్రీ ఫామ్ రేకులు తొలగిపోయిన సంఘటన మండల పరిధిలోని టిక్య దేవమ్మగూడం తండాలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. తండాకు చెందిన ధన్‌రాజ్ రూ. 14 లక్షలతో 6 వేలు కోళ్లు పట్టే పౌల్ట్రీ ఫామ్ నిర్మించాడు. ఈదురు గాలులు రావడంతో ఫామ్ పైకప్పు రేకులు తొలగిపోయాయి. స్వయం ఉపాధి కోసం అప్పు చేసి ఫామ్ నిర్మాణం చేపడుతున్న తరుణంలో ఈదురు గాలులతో రేకులు తొలగిపోయి ధ్వంసం అయినట్లు బాధితుడు ధన్‌సింగ్ వాపోయాడు. ప్రభుత్వ ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.


తొలగిపోయిన ఫామ్ రేకులు

గోవింద నామాలతో మార్మోగిన రంగంపేట

వైభవంగా రంగనాయక స్వామి కల్యాణం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట గ్రామంలో కొలువైన లక్ష్మి సమేత రంగనాయక స్వామి 688వ పంచాహ్నిక కల్యాణ రథోత్సవం కన్నులపండువగా జరుపుకొన్నారు. సోమవారం ఇందులో భాగంగా స్వామివారిని అమ్మవార్లను హనుమాన్ మందిర్ నుంచి భక్తుల గోవింద నామాల మధ్య ఎదుర్కోలు నిర్వహించారు. మంత్రం ఆలయ సన్నిధిలో ఏర్పాటు చేసిన పచ్చని పందిట్లో వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య వైష్ణవ సాంప్రదాయం ప్రకారం వేడుకలను వైభవంగా నిర్వహించారు. ముత్యాల తలంబ్రాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సాయంత్రం స్వామివారి అమ్మవారి విగ్రహాలను శేష వాహనంపై ఉంచి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. ఈ వేడుకల్లో తిరుమల తిరుపతి దేవస్థానం కృష్ణ దాసుస్వామి, భక్తులు ఉన్నారు.


స్వామివారి కల్యాణంలో అర్చకులు, భక్తులు



మడేలేశ్వరుడికి పూజలు

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో రజకుల కులదైవం మడేలేశ్వరస్వామి ఆలయ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈమేరకు సంఘం మహిళలు సోమవారం బోనాలు ఊరేగించారు. పీసీసీ రాష్ట్ర మాజీ కార్యదర్శి సుప్రభాతరావు, పార్టీ సీనియర్ నాయకులు దోమకొండ యాదగిరి, పట్టణ కాంగ్రెస్ కార్యదర్శి అల్లాడి వెంకటి, తదితరులు మడేలేశ్వరుని దర్శించుకున్నారు.

చాకరిమెట్లలో పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామిని హనుమాన్ దీక్షాపరుడు విజయవాడ, కండ్లకోయ దుర్గప్రసాద్ స్వామిజీ దర్శించుకున్నాడు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర ఘట్టాభిషేకం, మన్యసూక్త అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవదత్తశర్మ, ప్రభుశర్మ, హనుమాన్ దీక్షపరులు తదితరులు ఉన్నారు.


ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

భక్తిశ్రద్ధలతో గంధం ఊరేగింపు



టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్‌లో హజ్రాత్ సయ్యద్ బుర్హానుద్దీన్ ఔలియా రహ్మతుల్లాహి అలై ఉర్సు సోమవారం ప్రారంభమయ్యాయి. సోమవారం రాత్రి జామే మజీద్ నుంచి గ్రామ పురవీధుల గుండా గంధాన్ని ఘనంగా ఊరేగించారు. రాత్రివేళలో జల్సే అజ్మాతే ఔలియా నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా జ్యోతిర్లింగ ఆలయ ఉత్సవాలు


జ్యోతిర్లింగ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పెద్దశంకరంపేట(మెదక్): పేట శివారులోని తిరుమలాపూర్ జ్యోతిర్లింగ ఆలయ వార్షికోత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా జ్యోతిర్లింగాలకు, అష్టవినాయకులు, గోకర్ణ సుబ్రమణ్యేశ్వరస్వామి, దత్తాత్రేయ, మదనానంద సరస్వతి స్వామి మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు కొత్తప్రభు, గంగాధర్, రవీందర్, సిద్దేశ్వర్, సంతోష్, రాఘవులు, రాములు, రవీందర్ తదితరులు ఉన్నారు.

పచ్చిరొట్ట ఎరువుల పంపిణీ

తూప్రాన్: మండలంలోని రైతులకు సబ్సిడీపై 473 బస్తాల పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి గంగుమల్లు పేర్కొన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని రైతు ఆగ్రో సేవా కేంద్రంలో రైతులకు జీలుగా బస్తాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామాల రైతులకు 473 బస్తాలు జీలుగా వచ్చాయన్నారు. ఒక బస్తా ధర రూ.2,790 రూపాయలు సబ్సిడీ ధర రూ.1.674 ఉందని తెలిపారు. నాన్ సబ్సిడీపై రూ.1,116 కట్టాల్సి ఉందన్నారు. జీలుగ అవసరం ఉన్న రైతుల రైతు పట్టా పాస్‌బుక్ జీరాక్స్ కాపీ, ఆధార్ కార్డు జీరాక్స్ తీసుకురావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


తూప్రాన్: రైతులకు జీలుగ అందిస్తున్న వ్యవసాయాధికారి గంగుమల్లు

జీలుగ విత్తనాల పంపిణీ

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రం హవేళి ఘణాపూర్ రైతు ఆగ్రోస్ సేవా కేంద్రంలో రైతులకు జీలుగ విత్తనాలను సోమవారం ఏఓ నాగమాధురి పంపిణీ చేశారు. జీలుగ విత్తనాలు అవసరమున్న రైతులు తమ పట్టాపాస్‌బుక్ జిరాక్స్‌లు తీసుకొచ్చి తీసుకెళ్లొచ్చని తెలిపారు. 30కిలోల జీలుగ బస్తాకు రూ.1,116, జనుము 40 కిలోల బస్తాకు రూ.1,448కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. హవేళిఘణాపూర్ రైతు ఆగ్రోస్ కేంద్రంలో అందుబాటులో ఉంచామన్నారు.


హవేళిఘణాపూర్(మెదక్): జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ నాగమాధురి